
# విపక్షం బేజారు బీఆర్ఎస్ జోరు

- ఎన్నికల రంగంలోకి బీఆర్ఎస్ అభ్యర్థులు
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అస్త్రంగా ముందుకు
- కుమ్ములాటలో కాంగ్రెస్.. పత్తాలేని బీజేపీ
- ఎన్నికల షెడ్యూల్ వచ్చినా ఆ పార్టీల్లో కానరాని హడావుడి




సూర్యాపేట, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : తొమ్మిదేండ్లు అధికారంలో ఉండి వేల కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తమ ధైర్యమని బీఆర్ఎస్ ధీమాతో ఉంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థులు ఖరారు కావడంతో ఇప్పటికే ఆయా నియోకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటిస్తూ ఓ విడుత ప్రచారం సైతం పూర్తి చేశారు. ప్రజలకు కావాల్సినవన్నీ ప్రభుత్వం సమకూర్చడంతో తొమ్మిదేండ్లలో పాలనలో ధర్నాలు, నిరసనలు అన్న మాటే లేదు. అన్నీ కాదు, అంతకుమించి అందుతుండడంతో ప్రజలంతా అధికార బీఆర్ఎస్‌కు జై కొడుతుండగా ప్రతిపక్షానికి పని లేకుండా పోయింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు సరుకు, సరంజామాలతో ఎన్నికల సమరశంఖంలోకి దూకుతుండగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కుమ్ములాటలు, బీజేపీ అభ్యర్థుల కరువుతో విలవిల్లాడుతున్నాయి.

## ప్రతిపక్షాల్లో కనిపించని హడావిడి

సాధారణంగా ఎన్నికలు దగ్గరపడితే ఆయా రాజకీయ పార్టీలు ముందస్తుగానే సభలు, సమావేశాలు, అంతర్గత మీటింగులు, చేరికలు, పార్టీ జెండాలు, ప్రచార రథాలు సమకూర్చుకోవడం అంతా కోలాహలంగా ఉంటుంది. కానీ ఎందుకో ఈసారి ఎన్నికల కమిషన్ వారు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినా అధికార బీఆర్ఎస్ పార్టీ మినహా విపక్షాల్లో రాజకీయాల హడావిడి కనీసం కనిపించడం లేదు. సూర్యాపేట జిల్లా విషయానికొస్తే తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి నేతృత్వంలో నాలుగు నియోకవర్గాలకు కలిపి సుమారు 25వేల కోట్లకు పైనే నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదారు జిల్లాలు కలిపి సైతం ఈ స్థాయిలో నిధులు అందలేదు. అలాంటిది వేల కోట్ల రూపాయలు మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలకు ఖర్చు పెట్టామనే ధీమా, ప్రజలు సైతం గతంతో పోలిస్తే సంతోషంగా ఉండాలంటే బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలనే పట్టుదలతో కనిపిస్తుండగా ఎమ్మెల్యేల్లో ఎనలేని గెలుపు ధీమా కనిపిస్తున్నది. ఇక జిల్లాలో ప్రతిపక్షాల తీరు దయనీయంగా కనిపిస్తుంది.

## కుమ్ములాటల్లో కాంగ్రెస్, పత్తా లేని బీజేపీ

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎన్నికలకు ధీమాగా ఉండగా కొద్దిపాటి కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటలతో కొట్టుమిట్టాడుతున్నది. బీజేపీ మచ్చుకు సైతం కనిపించడం లేదు. సూర్యాపేట కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా చేస్తున్నారు. ఎవరికి టికెట్ వచ్చినా ఓటమి ఖాయం అవుతుందని ఆ నెపాన్ని మరో వర్గంపై నెట్టేందుకు ముందస్తుగానే ప్లాన్ చేసి పెట్టుకున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తుంగతుర్తి విషయానికి వస్తే ఇప్పటి వరకు తెరపైకి రాకపోగా... దాదాపు 10మందికి పైనే కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ ఆశిస్తూ ఎవరికి వారు గ్రూపులు కడుతున్నారు. కోదాడ కాంగ్రెస్ కుమ్ములాటలు హైదరాబాద్ గాంధీభవన్ వరకు వెళ్లి రాష్ట్రమంతా వినిపించిన విషయం విదితమే. హుజూర్‌నగర్‌లో అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్ గట్టెక్కడం కష్టమేనని ఇటీవల బీఆర్ఎస్‌లో చేరికలు... ప్రచారం చూసిన కాంగ్రెస్ నేతలే గుసగుసలాడుతున్నారు. మొత్తం మీద ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల సమర శంఖారవంలోకి దూకగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కుమ్ములాటలు, బీజేపీకి అభ్యర్థుల కరువుతో విలవిలలాడుతున్నాయి.

## కొత్తూరి రామారావుకు ఎమ్మెల్యే నివాళి

చిలుకూరు, అక్టోబర్ 12 : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కొత్తూరి రామారావు గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాన్ని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, ఎంపీటీసీ చిన్నా శైలజాజానకిరాములు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సైదులు

## కోదాడలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- పార్టీ మండలాధ్యక్షుడు సైదులు

మోతె, అక్టోబర్ 12 : కోదాడలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులు అన్నారు. మండలంలోని నామవరం గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మల్లయ్యయాదవ్ చేసిన అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు లింగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కంపాటి వెంకన్న, మండల యూత్ అధ్యక్షుడు జానిపాష, నామవరం గ్రామ శాఖ అధ్యక్షుడు నగేశ్, పాపచారి, నగేశ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

నడిగూడెం, అక్టోబర్ 12 : వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు అండగా ఉంటామని పేర్కొన్నారు. కోదాడలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రభుత్వ పథకాలే అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. అనంతరం కోదండ రామస్వామి ఆలయంలో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్ యువతిని ఆ దేశానికి అప్పగింత

కోదాడ రూరల్, అక్టోబర్ 12 : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని బంజారాకాలనీలో మార్చి నెలలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో కోదాడ పట్టణ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు, ఒక విటుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచారు. వ్యభిచార గృహం నుంచి రక్షించబడిన బంగ్లాదేశ్‌కు చెందిన బాధిత యువతిని న్యాయస్థానం ఆదేశాల మేరకు హైదరాబాద్ ప్రజ్వల హోమ్‌కు తరలించారు. హోమ్ అధికారులు, కోదాడ పోలీసులు బంగ్లాదేశ్ అధికారులను సంప్రదించి ఆ దేశానికి పంపించారు. కోదాడ పట్టణ సీఐ టి.రాము, ప్రజ్వల హోం సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎండీ సిరాజ్ అధ్వర్యంలో బాధిత యువతిని గురువారం ఇండియా, బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద ఆ దేశ అధికారులకు అప్పగించారు.

## గరిడేపల్లిలో రూ.1,06,900 సీజ్

గరిడేపల్లి, అక్టోబర్ 12 : ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1,06,900ను పోలీసులు పట్టుకున్న ఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగింది. గరిడేపల్లి ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీస్‌స్టేషన్ ముందు వాహనాలు తనిఖీ చేస్తుండగా మునగాల మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి వల్లపురెడ్డి ప్రకాశ్‌రెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1,06,900ను కారులో తీసుకవెళ్తున్నట్లు గుర్తించామన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తూ అధిక నగదు తీసుకెళ్తుండడంతో దానిని పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే ఆ నగదును దవాఖానలో చెల్లించేందుకు తీసుకెళ్తున్నట్లు బాధితుల ద్వారా తెలిసింది.

## సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- యాదాద్రి భువనగిరి జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రావు, న్యాయవాది వెంకట్‌రెడ్డి



ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సమాచార హక్కు చట్టం సభ్యులు

కోదాడ టౌన్, అక్టోబర్ 12 : సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రిభువనగిరి జోనల్ ఇన్‌చార్జి వంగవీటి శ్రీనివాస్‌రావు, న్యాయవాది వెంకట్‌రెడ్డి కోరారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన సమాచార హక్కు చట్టం 18వ ఆవిర్భావ వేడుకలో పాల్గొని మాట్లాడారు. అధికారుల్లో జవాబుదారీతనం, పారదర్శక పాలన అందించేందుకు 2005లో ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని చట్టబద్ధం చేసిందన్నారు. సమాచార హక్కు చట్టం సభ్యులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలన్నారు. ఈ చట్టంతో ప్రతి పౌరుడూ తనకు కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి పొందవచ్చునన్నారు. ప్రభుత్వ అధికారులు కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం అప్పిలేట్ అధికారి ఫోన్ నంబర్ ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తిని నాగేశ్వర్‌రావు, జిల్లా ఆర్గనైజర్ నవీన్‌తేజ, సభ్యులు గడ్డం అంజి,అమరబోయిన వీరబాబు, మట్టపల్లి శ్రీనివాస్, రామకృష్ణ, విజయ్, గోపి పాల్గొన్నారు.

## ఆచార్యులగూడెం పాఠశాలకు డెస్క్ బెంచీల బహూకరణ

చిలుకూరు, అక్టోబర్ 12 : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామానికి చెందిన సీఐ మొగిలిచర్ల రవి స్వగ్రామంలోని పాఠశాలకు లక్ష రూపాయల విలువ చేసే డెస్క్ బెంచీలను గురువారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు ప్రతిఒక్కరూ చేయూత ఇవ్వాలన్నారు. అనంతరం సీఐ దంపతులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం తేజోరామ్, జనార్దన్, ఉపాధ్యాయులు లింగయ్య, దొంగరి వెంకటేశ్వర్లు, సీఆర్పీ విజయనిర్మల, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సీఐ మొగిలిచర్ల రవి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**ప్లాట్ డాక్యుమెంట్ పోయినది**
కోట నర్సింహారావు S/o.వెంకట్రామయ్య, హుజూర్‌నగర్ Plot Doc. No.6599/2006, Xerox సెంటర్‌లో పోయినది. దొరికినవారు సంప్ర॥9010727886.
NLG-

**మాగాని పొలం అమ్మబడును**
నాయకన్ గూడెం చెర్వుకింద 5 ఎకరాల మాగాని అమ్మకానికి కలదు. హైవేకి 2వ బిట్టు Cont. No.9848773929, హైవే నుండి దారి కలదు.
NLG-310702

**ప్లాట్ డాక్యుమెంట్ పోయినది**
తాటికొండ సావిత్రి W/o.లక్ష్మీనర్సింహా రావు, హుజూర్‌నగర్ Plot Doc No.6597/2006, Xerox సెంటర్‌లో పోయినది. దొరికినవారు సంప్ర॥9010727886.
NLG-

**WANTED**
★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో॥ + వ॥ + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059